
సాక్షి ఒడిశా

ఆదివారం । 18 । మే । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,86,307లు, బంగారం 50 మిల్లీగ్రాములు, వెండి 20 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఆపదలో ఆసరాగా..!

విపత్కర పరిస్థితుల నుంచి పర్యాటకులను బయటపడేసేందుకు పూరీ జిల్లా పోలీసు యంత్రాంగం నడుం బిగించింది. తీరంలో ప్రాణరక్షకులు (లైఫ్ గార్డు)ను నియమించింది.

- 8లో



పిడుగు పడి పలువురు మృతి

రాష్ట్రంలో పిడుగు పాటుకు గురై పలువురు మృతిచెందారు. వేర్వేరు చోట్ల జరిగిన ఈ ఘటనలతో ఆయా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి.

- 8లో

న్యూస్‌రీల్

30 నుంచి మా సమిలాయి దుర్గ జాతర



పూజలందుకుంటున్న మా సమిలాయి దుర్గా

రాయగడ: స్థానిక పాయికొ వీధిలో మా సమిలాయి దుర్గా అమ్మవారి వార్షిక జాతర ఈ నెల 30 నుంచి ప్రారంభం కానుంది. ఐదు రోజుల పాటుగా జరిగే ఈ జాతరలో అమ్మవారి ఘటాలు ఊరేగింపు, ప్రత్యేక పూజలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు కమిటీ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే అమ్మవారి మందిరం ముస్తాబయ్యింది.

హైకోర్టుకు వేసవి సెలవులు

భువనేశ్వర్: ఒరిస్సా హైకోర్టుకు ఈ నెల 19 నుంచి జూన్ 16 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. అత్యవసర కేసుల విచారణ కోసం ఈ నెల 20, 23, 27, 30, జూన్ 3, 4, 10, 13 తేదీలలో ధర్మాసనాలు పని చేస్తాయి. సెలవుల కాలంలో ఏకసభ్య ధర్మాసనం అత్యవసర కేసుల విచారణ చేపడుతుందని హైకోర్టు స్పష్టం చేసింది.

విక్రయానికి సాగర్ మట్టి

జయపురం: జగన్నాథ్ సాగర్‌లో పూడిక తీసిన మట్టిని మున్సిపల్ అధికారులు విక్రయానికి పెట్టారు. సుమారు ఐదు వేల గనమీటర్ల మట్టి ఉంటుందని అంచనా వేశారు. దీన్ని విక్రయించడం ద్వారా మున్సిపాలిటీకి సుమారు రూ. మూడు లక్షలు ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక గనమీటర్ మట్టిని రూ. 58.50లుగా నిర్ణయించినట్టు మైనింగ్ విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఓ ఒక ప్రకటన విడుదలైంది. జగన్నాథ్‌సాగర్ పనులు పునరుద్ధరించటంతో ఆగర్ నుంచివచ్చిన మట్టిని వేలం వేసే బాధ్యతను మైనింగ్ విభాగానికి అప్పగించినట్టు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి, సబ్‌కలెక్టర్ అక్కవరం శౌర్యా రెడ్డి చెప్పారు. కాగా శనివారం నిర్వహించిన మట్టి వేలంలో నలుగురు వ్యక్తులు పాల్గొన్నప్పటికీ ఇద్దరు వ్యక్తుల మధ్యే పాట సాగింది.

కార్యాలయం ఆవరణలో మృతదేహం కలకలం



మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని మారుమూల ప్రాంతమైన చంద్రపూర్‌లో ఉన్న గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యాలయం బయట వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడు అజాంబిల సహాని (53)గా గుర్తించారు. గ్రామీణాభివృద్ధి శాఖలో నాలుగో తరగతి ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న సహాని నాలుగేళ్ల క్రితం ఇక్కడకు బదిలీపై వచ్చారు. శనివారం ఉదయం అయన మృతదేహం కార్యాలయం బయట పడి ఉండటంతో గుర్తించిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

కొలువుదీరిన అగ్నిగంగమ్మ ఘటాలు



ఘటాలు ముందు భోగాలు

రాయగడ: స్థానిక పిట్లవీధిలో ప్రారంభమైన అగ్నిగంగమ్మ అమ్మవారి పండగలో భాగంగా శనివారం అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలు కొలువుదీరాయి. మందిరం పక్కనే గల ప్రత్యేక గదిలో వీటిని ఏర్పాటు చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన భోగాలను భక్తులు సమర్పించారు. సాయంత్రం నుంచి పురవీధుల్లో ఘటాలు ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మామిడి పండ్లు, బియ్యం, నగదును అమ్మవారి ఘటాల్లో వేసి మొక్కుకున్నారు.

గజరాజుల హల్‌చల్

- నియమగిరి అడవుల్లో 27 ఏనుగుల సంచారం
- బిక్కుబిక్కుమంటున్న పరిసర గ్రామాల ప్రజలు



నియమగిరి ప్రాంత అడవుల్లో సెలయేటి వద్ద ఏనుగుల గుంపు

రాయగడ : నియమగిరి పర్వత ప్రాంతంలోని అడవుల్లో ఏనుగులు హల్‌చల్ సృష్టిస్తున్నాయి. ఎప్పుడు గ్రామాల్లోకి చొరబడి విధ్వంసం సృష్టిస్తాయో తెలియక పరిసర ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి పరిధిలోని నియమగిరి పర్వత ప్రాంతాలైన సింగారి, పార్శాలి, సునాఖండి, పాలమ, ఖరొజొడ, కరంజి, టిటిమస్కా, గుమ్మ, లంబ, తొట, లేఖాపాదొరొ, డంగిమట్టి, పొట్టంగిపాదొరొ, చాటికొన గ్రామాలు ఉన్నాయి. వీరంతా డొంగిరియా తెగకు చెందిన ఆదిమజాతి ప్రజలే. రెండు రోజులుగా కలహండి అటవీ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 27 ఏనుగుల గుంపు ఇక్కడ సంచరిస్తున్నాయి. గ్రామాల పరిధిలోని మామిడి, పనస, అరటి వంటి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. రాత్రివేళల్లో చొరబడి తెల్లవారేసరికి సమీప అడవుల్లోకి వెళ్లిపోతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. కొన్నిసార్లు తాగునీటి కోసం గ్రామాల్లోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయని వాపోతున్నారు.

రంగంలోకి ప్రత్యేక దళం..

నియమగిరి అడవుల్లో ఏనుగుల సంచారం సమాచారం అందుకున్న కళ్యాణసింగుపూర్ అటవీ రేంజ్ సిబ్బంది రంగంలోకి దిగారు. ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నట్లు రేంజర్ చందన్ గొమాంగొ తెలిపారు. ఇప్పటికే ప్రత్యేక దళం పరిశీలన చేస్తోందని చెప్పారు. ఇప్పటివరకు ఏనుగుల వల్ల ఎటువంటి ప్రాణనష్టం సంభవించకపోయినా, పంట నష్టం మాత్రం ఎక్కువగానే ఉందని గుర్తించామన్నారు. వేసవి తీవ్రతకు తాగునీటిని వెతుక్కుంటూ ఈ ప్రాంతానికి చేరుకుంటున్నాయని, త్వరలోనే వీటిని అడవుల్లోకి పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.



నియమగిరి ప్రాంతంలో పర్యటిస్తున్న అటవీ సిబ్బంది



పొటంగిపాదొరొ గ్రామం

హత్యాయత్నం కేసులో నలుగురు అరెస్టు

జయపురం: ఒక యువకుడుని హత్య చేసేందుకు ప్రయత్నించిన కేసులో నలుగురిని అరెస్టు చేసినట్టు జయపురం పట్టణ పోలీసు అధికారి ఉల్లాస చంద్ర రౌత్ శనివారం తెలిపారు. అరెస్టయినవారిలో క్రిష్టియన్‌పేటకు చెందిన ఆదిత్య ఖోశ్ల, రితేష్ ఘాధ, కొత్తవీధికి చెందిన కిరణ్ ఖొర, గోపబంధునగర్‌కు చెందిన శివ నాయిక్ ఉన్నారన్నారు. వారి వద్ద నుంచి ఒక పదునైన కత్తి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం క్రిష్టియన్‌పేట బిజురాజ్‌నగర్ వాసి సమీర్ గుణియ బయటకు వెళ్లాడు. 26వ జాతీయ రహదారి లక్ష్మీ పండ కూడలి వద్ద అతను నిలబడి ఉండగా దుండగులు వచ్చి డబ్బులు అడిగారు. అతడు డబ్బులు ఇవ్వక పోవడంతో అతడిని దుర్భాషలాడి చంపుతామని బెదిరించారు. అతడు తిరగబడటంతో వారు సమీర్‌ను కత్తితో పొడిచారు. అతడి వద్దగల ఏడు వేల రూపాయలు, మొబైల్ ఫోనుతీసుకు పోయారని బాధితుడు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. కత్తిపోట్లతో తీవ్రంగా గాయపడిన సమీర్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు చెప్పారు. నిందితులు నలుగురిని గాలించి పట్టుకొని అరెస్టు చేశామన్నారు.



అరెస్టయిన నిందితులు

దుబాయ్ కంపెనీ చేతికి సేవా పేపర్ మిల్లు!

జయపురం: కొన్ని నెలలుగా మూతపడి ఉన్న సేవా పేపరు మిల్లు తిరిగి ఉత్పత్తి ప్రారంభించే దిశగా యాజమాన్యం పావులు కదుపుతోంది. ప్రస్తుత హైదరాబాద్ యాజమాన్యం దుబాయి కంపెనీకి నిర్వహణ అప్పగించనుందనే ప్రచారం జరుగుతోంది. దీనిలో భాగంగానే శుక్రవారం భువనేశ్వర్‌లో పరిశ్రమల విభాగ కార్యదర్శి హేమంత శర్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జయపురం సమితి గగణాపూర్‌లోని సేవా పేపరుమిల్లు రెండు నెలల్లో తిరిగి తెరిచేందుకు నిర్ణయించారు. సమావేశంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, దుబాయ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కంపెనీ ప్రతినిధులు

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి బిమల్ రవులో

- జిల్లా న్యాయ సహాయ ప్రాధికరణ కార్యదర్శి బిమల్ రవులో

పర్లాకిమిడి: చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా న్యాయ సహాయ ప్రాధికరణ కార్యదర్శి బిమల్ రవుళో అన్నారు. పురపాలక సంఘంలో సాలిడ్ వ్యర్థాల నిర్వాహణపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లా న్యాయ సరీస్వసుల ప్రాధికరణ ఆధ్వర్యంలో పర్లాకిమిడి పురపాలక సంఘం కాన్ఫరెన్స్ హాల్‌లో న్యాయ సహాయ అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. సదస్సులో పురపాలక ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లక్ష్మణ ముర్ము, డీటీవో రవీంద్ర కుమార్ దాస్, హెల్త్ ఆఫీసర్ ఎరుకోల వెంకటరమణ, స్వచ్ఛ కార్యకర్తలు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో పోస్కో, పోష్ చట్టాలు, బాల్యవివాహాల చట్టం అమలుకు పురపాలక సిబ్బంది సహకరించాలని అన్నారు. నల్సా లీగల్ ఎయిడ్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దీనికై నల్సా టోల్‌ఫ్రీ నంబర్ 15100 డయల్ చేయాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి బిమల్ రవుళో అన్నారు.



పాల్గొన్న పురపాలక హెల్త్ సిబ్బంది, అధికారులు

ఓపీసీసీ సోషల్ మీడియా చైర్మన్‌గా సత్యజీత్



సత్యజీత్ గొమాంగొ

రాయగడ: ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా విభాగం చైర్మన్‌గా గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొ నియమితులయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సాధారణ కార్యదర్శి కేసీ వేణు గోపాల్ ప్రకటన విడుదల చేశారు. సత్యజీత్ నియామకంపై పార్టీ కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

సేవాభావం అలవరుచుకోవాలి



ఆర్ట్ ఆఫ్ గివింగ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ, నిర్వాహకులు

పర్లాకిమిడి: సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని పేదలకు, అణగారిన వర్గాలకు అందజేయాలనే ఉద్దేశంతో ఆర్ట్ ఆఫ్ గివింగ్‌ను కిట్ విశ్వవిద్యాలయం చైర్మన్, ఫౌండర్ అచ్యుతా సామంత్ ఏర్పాటుచేశారని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాల హాలులో శనివారం ఆర్ట్ ఆఫ్ గివింగ్ సంస్థ 12వ వార్షికోత్సవాన్ని కలెక్టర్‌తో పాటు ఎస్పీ జ్యోతింద్రనాథ్ పండా ప్రారంభించారు. అనంతరం అచ్యుతా సామంత్ రాసిన ఆర్ట్ ఆఫ్ గివింగ్– ఎ వే ఆఫ్ లైఫ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, మహారాజా బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు డి.శ్రీరామ్మూర్తి, అధ్యాపకులు సంబిత్ కుమార్ పాణిగ్రాహి, ధీరజ్ పట్నాయిక్, గిరిధర్ పండా తదితరులు పాల్గొన్నారు.

కొండను ఢీకొన్న కంటైనర్



ప్రమాదానికి గురైన కంటైనర్



కంటైనర్‌లో మృతి చెందిన పశువులు

రాయగడ: కొరాపుట్ జిల్లాలోని రాలేగెడ్డ ఘాట్ రోడ్డులో ఓ కంటైనర్ అదుపు తప్పి పక్కన కొండను ఢీకొట్టింది. ఈ ఘటనలో పది పశువులు మృతి చెందగా.. డ్రైవరు, హెల్పర్లకు స్వల్ప గాయాలయ్యాయి. శనివారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ప్రమాదానికి సంబంధించి కొరాపుట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. కంటైనర్‌లో పశువులను పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తుండగా రాలేగెడ్డ మలుపులో అదుపుతప్పి ప్రమాదానికి గురైంది.

ముగిసిన గ్రామదేవత ఉత్సవాలు



ఘటాల ఊరేగింపు

జిల్లాలోని మునిగుడలో గౌడవీధిలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న గ్రామదేవత (ఠకురాణి) ఉత్సవాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. పూజారి మల్లెలు తొక్కి(అగ్నిపై నడవడం) ఉత్సవాలకు ముగింపు పలికారు. అంతకు ముందు అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలతో పట్టణంలో ఊరేగింపు చేపట్టారు. దుష్టశక్తులు గ్రామం లోపలికి ప్రవేశించకుండా అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– రాయగడ



నిప్పులపై నడుస్తున్న పూజారి

దేశాభివృద్ధిలో ఎన్‌సీసీ పాత్ర కీలకం



సదస్సులో ప్రసంగిస్తున్న గవర్నర్ హరిబాబు

భువనేశ్వర్: క్రమశిక్షణ, వ్యక్తిత్వ నిర్మాణం, నిస్వార్థ సేవ దృక్పథంతో బాధ్యతాయుతమైన పౌరులను ఆవిష్కరించడంలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) శక్తివంతమైన యువ ఉద్యమని, ఈ రూపకల్పనలో నాయకత్వ లక్షణాలతో కూడిన బలమైన యువతరం వెలుగు చూస్తుందని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి అన్నారు. శనివారం స్థానిక ఓయూఏటీ ఆడిటోరియంలో రాష్ట్ర శాఖ ఎన్‌సీసీ డైరెక్టరేట్ నిర్వహించిన ఎన్‌సీసీ – ఏ ఫోర్స్ మల్టిప్లైయర్ ఇన్ నేషన్ బిల్డింగ్ అనే రాష్ట్ర స్థాయి సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. జాతీయ భద్రత, సామాజిక, సాంస్కృతిక సహకారాలు, యువతరం పురోగతి, డిజిటల్ సాధనాలు, విధానాల వినియోగం తీరును వివరించారు. బలమైన సమైక్య దేశం నిర్మించడానికి ఎన్‌సీసీ దోహదపడుతుందన్నారు. సాయుధ దళాలతో యువత అనుసంధానం, నాయకత్వం, వ్యక్తిత్వ వికాసం అంశాల్ని ఈ సదస్సు చర్చించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా, గిరిజన, గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి యువత ప్రాధాన్యత, మహిళలకు సాధికారత కల్పించడంలో ఎన్‌సీసీ నిరంతరం కృషి చేస్తోందని ప్రశంసించారు. కార్యక్రమంలో సాయుధ దళాల అధికారులు, విద్యావేత్తలు, క్యాడెట్లు, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైలుపై రాళ్ల దాడి




తపస్విని ఎక్స్‌ప్రెస్ అద్దం పలిగిన దృశ్యం



బెర్త్‌పై పడిన కిటికీ అద్దం ముక్కలు

భువనేశ్వర్: పూరీ – హతియా తపస్విని ఎక్స్‌ప్రెస్ రైలుపై రాళ్లు రువ్విన సంఘటన తీవ్ర కలకలం రేపింది. శనివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఏసీ బోగీ దెబ్బతింది. నిద్రలో ఉండగా జరిగిన ఈ ఘటనతో ప్రయాణికులు ప్రాణభయంతో బెంబేలెత్తారు. రెంగాలి, ఝార్సుగుడ రైల్వే స్టేషన్ల మధ్య శనివారం వేకువజాము 5.30 గంటలకు ఈ దాడి జరిగింది. ఈ ఘటనకు గల కారణం తెలియలేదు. అనంతరం రంగంలోకి దిగిన ఆర్పీఎఫ్ పోలీసులు నిందితులను గుర్తించడానికి దర్యాప్తు ప్రారంభించారు. సమీప స్టేషన్లలో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఇటీవల కాలంలో తరచూ సుదూర రైళ్లను లక్ష్యంగా చేసుకుని రాళ్లు రువ్వుతున్నారు. దక్షిణ్ విహార్ ఎక్స్‌ప్రెస్, రౌర్కెలా – పూరీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లపైనా ఇటువంటి రాళ్ల దాడి జరిగింది.



పగిలిన బి - 7 బోగీ అద్దం

ఆపదలో ఆసరాగా..!


స్ట్రెచ్చర్‌పై తరలిస్తూ..


విపత్కర పరిస్థితుల్లో ఆక్సిజన్‌తో ప్రాణరక్షణ కల్పిస్తూ..


కెరటాల్లో కొట్టుకుపోతున్న వారిని ఒడ్డుకు చేర్చుతున్న లైఫ్ గార్డులు

వేసవి సెలవుల నేపథ్యంలో పూరీ పట్టణం యాత్రికులు, సందర్శకులు, పర్యాటకులతో కిటకిటలాడుతోంది. జగన్నాథుని దర్శనం తర్వాత పెద్ద సంఖ్యలో పర్యాటకులు తీరానికి చేరుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అలల ధాటికి గల్లంతవుతుంటారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల నుంచి పర్యాటకులను బయటపడేసేందుకు పూరీ జిల్లా పోలీసు యంత్రాంగం నడుంగిబిగించింది. సముద్రంలో కొట్టుకుపోయే బాధితుల్ని తక్షణమే ఆదుకుని ఒడ్డుకు చేర్చేందుకు ప్రత్యేక శిక్షణ కల్పించిన ప్రాణ రక్షకులు (లైఫ్ గార్డు)ని నియమించింది. ప్రమాదకర తీర ప్రాంతాల్లో ఈ వర్గం అనుక్షణం నిఘా వేసి అప్రమత్తంగా వ్యవహరిస్తుంది. వీరికి ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. – భువనేశ్వర్


లైఫ్‌గార్డులకు పోలీసుల తర్ఫీదు

క్లుప్తంగా

ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కొత్త కార్యవర్గం

రాయగడ: ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(ఓపీసీసీ) నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సాధారణ కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ శనివారం ప్రకటించారు. ఓపీసీసీ కోశాధికారిగా సిద్ధార్థ్ స్వరూప్ దాస్, ఉపాధ్యక్షులుగా తారాప్రసాద్ బాహిణీపతి, రమేష్ జెన్నా, సంతక్షష్ సింగ్ సాలూజా, దేవాశీష్ పట్నాయక్, సీఎస్ రజీన ఎక్కా, లలటుందు మహాపాత్రొ, సస్మిత బెహరాలు నియమితులయ్యారు. సాధారణ కార్యదర్శులుగా అశోక్ దాస్, అప్పలస్వామి కద్రక, ప్రపుల్ల ప్రధాన్, మంగూ ఖిల్లా, పవిత్ర సావుంత, నీలమాధవ హికక, సువర్ణ నాయక్, సయ్యద్ యాషిర్ నవాజ్, బిజయానంద చవులియ, మధుస్మిత శెఠి, కార్యదర్శులుగా తులేశ్వర్ నాయక్, సస్మిత పండా, శిల్పశ్రీ హరిచందన్, దేవాష్రమిత శర్మ, లక్ష్మీధర్ సింగ్, దిలీప్ దురియా, రూపక్ తురుక్, సింహాచల్ గిరి ఉలక, మానిషా త్రిపాఠి, సక్కా సుజిత్, మోహన్ హేంబ్రమ్, అనిమా మింజ్‌లు నియమితులయ్యారు. ఓపీసీసీ అధ్యక్షుడిగా ఇదివరకే భక్తచరణ్ దాస్ నియమితులైన విషయం తెలిసిందే.

ప్రసాదం పవిత్రతను కాపాడాలి

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని అన్న ప్రసాదం పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని శ్రీ మందిరం అధికార యంత్రాంగం పేర్కొంది. స్వామి దర్శనం తర్వాత ప్రధాన దేవస్థానం సముదాయం ఆనంద బజారు ప్రాంగణంలో కొనుగోలు చేసిన మహాప్రసాదాన్ని నేలపై కూర్చుని తినడమే ఆచారంగా వస్తోందని స్పష్టం చేశారు. ఇటీవల స్థానిక హోటల్‌లో డైనింగ్ టేబుల్‌పై జగన్నాథుని మహా ప్రసాదం తింటున్న చిత్రం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.

ఎస్ఈబీసీల అభివృద్ధికి కృషి


ముఖ్యమంత్రిని సత్కరించిన నాయకులు

భువనేశ్వర్: వెనుకబడిన తరగతుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రకటించారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఎస్ఈబీసీ) విద్యార్థులకు 11.25 శాతం రిజర్వేషన్లను అమలు చేసినట్లు పేర్కొన్నారు. విద్యా రంగంలో వెనుకబడిన తరగతులకు విద్యాభ్యాసానికి వీలు కల్పించేందుకు రిజర్వేషన్లు అమలు చేసినందుకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సూరత్ బిస్వాల్ నేతృత్వంలో ఓబీసీ నాయకులు ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ చారిత్రాక నిర్ణయం వల్ల వెనుకబడిన తరగతుల విద్యార్థులు ప్రత్యేకంగా ప్రయోజనం పొందుతారని హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు సత్కారం



పర్లాకిమిడి: రాష్ట్ర సెకండరీ బోర్డు టెన్త్ పరీక్ష ఫలితాల్లో గజపతి జిల్లా వ్యాప్తంగా మొదటి ర్యాంకు సాధించిన ప్రజ్యోతి చౌదురి (566/600) విద్యార్థినీ, తండ్రి నిత్యానంద చౌదురి, తల్లి నమితా చౌదురికి ఎంబీడీ పబ్లిషర్స్ తరపున శనివారం సత్కరించారు. అనంతరం ఎంబీడీ పబ్లికేషన్స్ 2025–26 విద్యాసంవత్సరం శాంపిల్ టెక్స్ట్ పేపర్లను పలువురికి గంజాం, గజపతి, కంధమాల్ మార్కెటింగ్ మేనేజరు నిహార్ రంజన్ పండా అందజేశారు. కార్యక్రమంలో మహంత రామానంద దాస్, సరస్వతీ శిశు మందిర్ ఆచార్యులు దుర్గాప్రసాద్ సాహు పాల్గొన్నారు.

13 అడుగుల కింగ్‌కోబ్రా పట్టివేత


కింగ్‌కోబ్రాను పట్టుకున్న దృశ్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంపీవీ 23 గ్రామంలోని ఓ టైర్ల మెకానిక్ షాప్‌లో 13 అడుగుల కింగ్‌కోబ్రా పాము స్థానికులను శనివారం భయపెట్టింది. షాప్ యజమాని సరోజిత్ కోయల్ పామును చూసిన వెంటనే కలిమెల స్నేక్ రిస్క్యూ వలంటీర్ రాకేష్‌కు సమాచారం ఇచ్చారు. ఆయనతో పాటు రాజేంద్రప్రసాద్ సాహు రెండు గంటలు శ్రమించి పామును పట్టుకున్నారు. దీని పొడవు 13 అడుగులు ఉండగా ఏడు కిలోల బరువు ఉంది. అనంతరం పామును ఎంఈ–12 గ్రామ అడవిలో వదిలేశారు

పిడుగు పడి పలువురు మృతి


రాయగడ: పారిడిగుడలో ఘటనా స్థలం వద్ద మృతదేహాలు


మల్కన్‌గిరి: ముకే పోడియమి మృతదేహం


జయపురం:సెమిలిగుడ సమితిలో మృతిచెందిన దాస్ జానీ

రాయగడ: పిడుగు పడటంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన సంఘటన కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి ఒడియాపెంటొ పంచాయతీ పారిడిగుడ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతులు బృధి మండిగ (60), ఆమె మనవరాలు కొసా మండంగి (18), అంబికా (35)గా గుర్తించారు. శుక్రవారం గ్రామ సమీపంలో పొలం పనులు చేసేందుకు నాన్నమ్మ బృదితో కలిసి మనవరాలు కొసా, అంబికా వెళ్లారు. ఆ సమయంలో వర్షం కురవడంతో ఓ గుడిసెలో తలదాచుకున్నారు. ఒక్కసారిగా పిడుగు పడటంతో వారంతా అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొరాపుట్ ఆస్పత్రికి తరలించారు.

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మండపల్లి పంచాయతీ బేచాల్‌గూడలో శనివారం సాయంత్రం పిడుగు పాటుకు ఓ మహిళ మృతి చెందింది. మాల పోడియమి, ముకే పోడియమి దంపతులు మేకలు కాపు కాసేందుకు వెళ్లగా పిడుగు పడటంతో ముకే(35) అక్కడికక్కడే మృతి చెందింది. ఐఐసీ చంద్రకాంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

జయపురం: కొరాపుట్ జిల్లాలో కాలవైశాఖి బీభత్సం సృష్టిస్తోంది. వర్షం, ఈదురు గాలులు, పిడుగుల ధాటికి పౌరులతో పాటు పశువులు మృత్యువాత పడుతున్నాయి. శుక్రవారం సాయంత్రం కొరాపుట్ జిల్లా లక్ష్మినగర్ సమితిలో ముగ్గురు మరణించిన విషయం విదితమే. తాజాగా సెమిలిగుడ సమితి ఖాలపొడి గ్రామంలో దాస్ జానీ(32)అనే వ్యక్తి పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. ఉమ్మరకోట్ సమితి బెన పంచాయతీ శంకరడ గ్రామంలో లలిత మఝి(15) అనే మహిళ మృతిచెందింది. వివిధ ప్రాంతాల్లో 8 మేకలు, 12 పశువులు మరణించినట్లు తెలిసింది.

ప్రకృతి వైపరీత్యాల సమయంలో అప్రమత్తంగా ఉండాలి


సమావేశానికి హాజరైన అధికారులు, ఉద్యోగులు

మల్కన్‌గిరి: ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు అన్నారు. మల్కన్‌గిరిలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పాటిల్ అధ్యక్షతన శనివారం జిల్లా స్థాయి ప్రకృతి విపత్తుల నిర్వహణ కమిటీ సమావేశంల జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో నీటి ముంపు ప్రాంతాల ప్రజలకు 24/7 సేవలు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమును ఏర్పాటు చేయాలన్నారు. జనరేటర్లు, మంచినీరు, ఆహారం, అత్యవసర ఔషధాలు, పాము, కుక్కకాటు మందులపై అధికారులు చర్చించారు. ముంపు ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ, అగ్నిమాపక శాఖ ద్వారా నీటి పంపింగ్, విద్యుత్ సరఫరాపై సమావేశంలో చర్చించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ అన్నారు. సమావేశంలో నవరంగ్‌పూర్ ఎంపీ బోలాభద్ర మాఝి, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి , జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సమారీ టాంగులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ గోవిందపాత్రో, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే మనాస్ మడ్కమి, ఆదివాసీ సమాజ మహాసంఘ అధ్యక్షుడు బంధు ముదులీ, ఘనశ్యాం మడ్కమి పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం


ఆటోకు సురక్ష క్యూఆర్ కోడ్ స్టిక్కర్ అతికిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆటో డ్రైవర్లు, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తున్నామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. దీనిలో భాగంగా స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సురక్ష క్యూ ఆర్ కోడ్ యాప్‌ను శనివారం ప్రారంభించారు. అనంతరం కోడి రామ్మూర్తి స్టేడియంలో ఆటోలకు క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆటో డ్రైవర్, ఓనర్ వివరాలు, ఆటో ప్రయాణించే దిశ, రోడ్డు మార్గం, లోకేషన్ తదితర పూర్తి వివరాలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సుమారు 26 వేల ఆటోలు రిజిస్ట్రేషన్ చేసుకోగా ప్రస్తుతం 20 వేల ఆటోలు రవాణాలో ఉన్నాయన్నారు. ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు, మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన ఈ యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లేందుకు డ్రైవర్లు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన శక్తి యాప్‌తో ఈ సురక్ష యాప్‌ను రానున్న రోజుల్లో అనుసంధానం చేస్తామన్నారు. అనంతరం ఈ సురక్ష క్యూ ఆర్ కోడ్ యాప్ రూపకల్పన చేసిన ఐటీ కోర్ ఏఎస్ఐ బి.రమేష్, ఉత్తమ ఆటో డ్రైవర్లు భాస్కరరావు, శ్రీనివాసరావులను ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ విజయ సారధి, అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఎంవీ ఐ.గంగాధర్, సీఐలు పైడిపునాయుడు, ఇమ్మనుల్ రాజు, ఈశ్వర్‌రావు, అవతారం, శ్రీనివాసరావు, సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని తోటపాలేం గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన దీర్ఘాసి ఈశ్వరరావు (50) సైకిల్ మీద వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న స్కూటర్ ఈనెల 7వ తేదీన ఢీకొంది. దీంతో గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈశ్వరరావు శనివారం మృతి చెందారు. ఆస్పత్రి వర్గాలు నివేదిక ఆధారంగా ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో జవాన్ మృతి


మోహనరావు (ఫైల్)

ఆమదాలవలస: మున్సిపాలిటీలోని ఆరో వార్డు టి.మన్నయ్యపేటకు చెందిన గొద్దు మోహనరావు (46) అనే బీఎస్ఎఫ్ జవాన్ గుండెపోటుతో మరణించాడు. న్యూఢిల్లీ లోని బీఎస్ఎఫ్ హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తుండగా, శుక్రవారం సాయంత్రం గుండెపోటుకు గురయ్యారు. వెంటనే తోటి సైనికులు మోహనరావును సమీపంలోని ఆస్పత్రికు తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆదివారం ఉదయం ఆయన మృతదేహం ఢిల్లీ నుంచి విశాఖపట్నంకు, అక్కడ నుంచి స్వగ్రామానికి చేరుకోనుంది. మోహనరావుకు భార్య సంధ్య, కుమార్తె జాస్మిని, కుమారుడు శశాంక్ ఉన్నారు. జవాన్ మృతితో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి.

పశువుల వాహనం స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని ఎచ్చెర్ల పోలీసులు శుక్రవారం రాత్రి చిలకపాలేం సమీపంలో జాతీయ రహదారిపై పట్టుకున్నారు. 25 పశువులు అక్రమంగా తరలిస్తుండడంతో వాహనం సీజ్ చేశారు. పశువులు అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు. పశువులను సంరక్షణ కోసం విజయనగరం గోశాలకు తరలించినట్లు ఎస్ఐ సందీప్‌కుమార్ తెలిపారు.

ఏపీఈఏపీ సెట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించనున్న ఏపీఈఏపీ సెట్–2025 (ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ అండ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)కు జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 19వ తేదీ నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించనున్నారు. సెలవు రోజుల్లో మినహా ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ముందుగా 19, 20 తేదీల్లో బైపీసీ స్ట్రీమ్ పరీక్ష నిర్వహిస్తారు. 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలు చేపడతారు. జిల్లాలో నాలుగు ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో రోజుకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో షిఫ్టులో పరీక్షలు నిర్వహిస్తారు. అధికారులు ఈ మేరకు నాలుగు పరీక్ష కేంద్రాలు ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీ, చిలకపాలేంలోని శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీ, టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కాలేజీ, నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్‌లో ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా నుంచి ఎంపీసీ, బైపీసీ స్ట్రీముల్లో 18,000 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలకు నిమిషం నిబంధన అమలు చేస్తారు. పరీక్ష కేంద్రానికి గంట ముందు నుంచే అనుమతిస్తారు.

గడ్డి మందు తాగి యువతి ఆత్మహత్య

కాశీబుగ్గ: పలాస మండలంలోని లొత్తూరు పంచాయతీ తొసరాడ గ్రామానికి చెందిన సవర వసంతి (22) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇంటి వద్ద వసంతి ఖాళీగా ఉండడంతో తల్లి సవర మహాలక్ష్మి ఏదైనా పనిచేసుకోవాలని సూచించారు. దీంతో కోపంతో శుక్రవారం గడ్డిమందు తాగింది. దీంతో హుటాహుటిన పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడ నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ యువతి మృతి చెందింది. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కోవాలి


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కద్రక. పక్కనే కలెక్టర్ పట్వారీ తదితరులు

రాయగడ: రానున్న వర్షాకాలంలో ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు సమాయత్తం కావాలని రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ ఫరూల్ పట్వారీ అధ్యక్షతన జిల్లా స్థాయి ప్రకృతి విపత్తు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. వంశధార, నాగావళి నదీ తీర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నవీన్‌చంద్ర నాయక్, ఎమర్జెన్సీ అధికారి మనోజ్ కుమార్ నాహక, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చంద్రకాంత్ మాఝి, బీడీఓలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు


అరెస్టు అయిన నిందితులు

జయపురం: దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. 2024 అక్టోబర్ 21వ తేదీన నవరంగపూర్ జిల్లా తెంతులికుండ్ సమితి పాత్రోపుట్ గ్రామం మార్గంలో జరిగిన దొంగతనంలో శుక్రవారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి సబ్బీర్ అహమ్మద్ నేడు వెల్లడించారు. 2024 అక్టోబర్ 21 వ తేదీన సాయంత్రం సుమారు ఆరు గంటల సమయంలో తెంతులికుంటి సమితి పాత్రోపుట్ గ్రామం సహింసు బిశాయి బైక్ పై వెలుతున్న సమయంలో రంగమతిగుడ గ్రామం సమీపంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను ఆపి కత్తి చూపి అతడిని దోచుకున్నారు. అతడి మొబైల్ ఫోను కూడా తీసుకు పోయారు. ఈ విషయంపై బిశాయి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు సమయంలో నిందితులను గుర్తించి వారిని ఈ నెల 16 వ తేదీన అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారి నుంచి 5 సెల్ ఫోనులు స్వాధీన పరచుకున్నట్లు వెల్లడించారు.అరెస్టు అయిన వారు మఝిగుడ గ్రామం దిలు బర్బరి(18)బాబి హరిజన్(21) లు అని వెల్లడించారు. వారిని కోర్టులో హాజరు పరచినట్లు వెల్లడించారు. నిందితులపై మరో నాలుగు దొంగతనం కేసులు ఉన్నటగ్లు అధికారి వెల్లడించారు.

అపార్ట్‌మెంట్ నిర్మాణంపై జేసీకి ఫిర్యాదు


జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు సమస్య వివరిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక ఇందిరానగర్‌లో కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణ పనులు గురించి జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ దృష్టికి పంచాయతీ సర్పంచ్ బి.శంకర్, వార్డు సభ్యులు కేసీహెచ్‌బీ గుప్త, బీఎల్ శర్మ, ఆర్.శ్రీధర్‌లు తీసుకెళ్లారు. శనివారం జేసీ నరసన్నపేట పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులకు అనుమతులు లేకపోయినా యథేచ్ఛగా పనులు జరుగుతున్నాయని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయనకు తెలియజేశారు. సుడా షార్ట్‌ఫాల్‌లో పెట్టి స్టాప్ వర్క్ ఆర్డర్ ఇచ్చిందని వివరించారు. దీనికి జేసీ స్పందించి వెంటనే సుడా అధికారులకు తన మొబైల్ నుంచి మెసేజ్ చేశారు. దీనిపై చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. మరోపక్క సుడా ఇచ్చిన స్టాప్ ఆర్డర్ ప్రకారం పనులు నిలిపివేయాల్సింది పంచాయతీ ఈవోనే అని సుడా అధికారులు అంటున్నారు. ఈ మేరకు ప్రత్యేక జీవో ఉందని చెబుతున్నారు. అలాగే మరో వార్డు సభ్యుడు బోయిన సతీష్, స్థానిక నాయకులు తాలాభక్తుల గోవిందరావు, రామకృష్ణలు హోల్డ్‌లో ఉన్న బొరిగివలస రెవెన్యూ పరిధిలోని 18/1 సర్వే నంబర్‌ను సరిచేయాలని కోరారు. దీనివలన నరసన్నపేటలో 13 వీధులకు చెందిన ప్రజలు క్రయవిక్రయాలు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే స్థానిక లెపర్సీ కాలనీలో మంచినీటి సమస్య ఉందని భాగ్యం, లక్ష్మిలు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. చర్యలు తీసుకోవాలని పంచాయతీ ఈవోకు ఆదేశించారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చర్యలు

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇషాన్ బాషా


సమీక్ష నిర్వహిస్తున్న ఎస్ఈ, ఈఈ, డీఈలు

నరసన్నపేట: జల జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇషాన్ బాషా తెలిపారు. శనివారం నరసన్నపేట వచ్చిన ఆయన స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయంలో నరసన్నపేట సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో జల్ జీవన్ మిషన్ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాజాగా జిల్లాలో రూ.813 కోట్లు విలువైన 1,793 పనులను ప్రభుత్వం రెన్యూవల్ చేసిందన్నారు. రెన్యూవల్ పనుల్లో 1,546 పనులకు టెండర్లు పిలిచామని, వీటిలో 800 పనులకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి టెండర్లు వేశారని వివరించారు. మరో 746 పనులకు టెండర్లు రావాల్సి ఉందన్నారు. వీటికి కూడా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వస్తే జిల్లాలో దాదాపుగా జల జీవన్ పథకంతో ఇంటింటికీ తాగునీరు అందించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో 5.34 లక్షల గృహాలు ఉన్నట్లు లెక్కలు ఉన్నాయని, వీటిలో 2.12 లక్షల గృహాలకు కుళాయిలు వేయడం జరిగిందన్నారు. వచ్చే మార్చి నాటికి కనీసం మరో 2 లక్షల గృహాలకు కుళాయిలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

గొట్టా నుంచి నీటి సరఫరాకు ప్రతిపాదనలు

ప్రస్తుతం గొట్టా బ్యారేజీ నుంచి పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ప్రజలకు తాగునీరు అందిస్తున్నామని, ఇది విజయవంతంగా రన్ అవుతోందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో మిగిలిన ఆరు నియోజకవర్గాలు శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, ఆమదాలవలస, పాతపట్నం, ఎచ్చెర్ల ప్రజలకు కూడా గొట్టా బ్యారేజీ నుంచి తాగునీటి సరఫరాకు రూ.3,300 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. దీంట్లో మొదటి విడతగా రూ.900 కోట్లతో నరసన్నపేట, టెక్కలి నియోజకవర్గాలకు అనుమతుల రావొచ్చని పేర్కొన్నారు. కాగా నరసన్నపేట మేజర్ పంచాయతీలో ప్రస్తుతం మొదటి ఫేజ్‌లో రూ.5.15 కోట్లతో జల జీవన్ పనులు జరుగుతున్నాయని, రెండో ఫేజ్‌లో మిగిలిన భాగాలకు కుళాయిలు వేయడానికి రూ.9.06 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరికి నరసన్నపేటలో పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఈఈ రంగ ప్రసాద్, డీఈ సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిడుగులు పడేటప్పుడు తస్మాత్..: కలెక్టర్


జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: పిడుగులు పడేటప్పుడు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ప్రజలకు సూచించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణంలో మార్పులపై రాష్ట్ర విపత్తుల సంస్థ ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఫోన్ ద్వారా కూడా అందిస్తుందని, వాటి ఆధారంగా ప్రజలు అప్రమత్తమై సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరారు. వాతావరణ విపత్తులపై ఏపీ విపత్తుల సంస్థ ఫోన్‌లలో అప్రమత్తం చేస్తుందని వాటిని పాటించాలని కోరారు. వివిధ ప్రాంతాల్లో పిడుగు పాటుకు ఒకరిద్దరు మృతి చెందినట్టు సమాచారం అందుతుందని ప్రజలందరూ వీటి పట్ల జాగ్రత్త వహించాలన్నారు.

విద్యుదాఘాతంతో రెండు దున్నల మృతి


మృతి చెందిన జత దున్నలు

భామిని: మండలంలోని సొలికిరికి చెందిన బిల్లింగి కురువులకు చెందిన రెండు దున్నపోతులు విద్యుదాఘాతానికి గురై శనివారం మృతి చెందాయి. వీటి సుమారు రూ.లక్ష ఉంటుందని చెబుతున్నారు. సొలికిరి నుంచి ఇసుకగూడ వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉండడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ విషయం భామిని విద్యుత్ శాఖాధికారులకు తెలియడంతో ప్రమాదాన్ని వచ్చి చూశారు. అనంతరం పశు సంవర్ధక శాఖ అధికారులు వచ్చి దున్నపోతులకు పోస్టుమార్టం చేసి బాధిత రైతుకు అప్పగించారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

బొండపల్లి: మండల కేంద్రంలోని జాతీయ రహదారి 26పై నడిచి వెళ్తున్న కిలపర్తి సన్యాసప్పడును ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గాయాల పాలయ్యాడు. సన్యాసప్పడు జాతీయ రహదారిని దాటే క్రమంలో విజయనగరం వైపు నుంచి గజపతినగరం వైపు వెళ్తున్న వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడడంతో చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పట్టుబడిన పీడీఎస్ బియ్యం


పట్టుబడిన పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

పార్వతీపురం రూరల్: మండలంలోని గోచెక్క గ్రామంలో ఆంధ్రా నుంచి ఒడిశాకు అక్రమంగా బొలెరో వాహనంలో పది క్వింటాళ్ల ప్రభుత్వ ఉచిత సరఫరా బియ్యాన్ని తరలించేందుకు సిద్ధం చేస్తుండగా ముందస్తు సమాచారంతో తరలించిన వారితో పాటు బొలెరో వాహనం పట్టుకున్నామని విజిలెన్స్ ఎస్ఐ బి.రామారావు తెలిపారు. బొలెరోలో ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. గోచెక్క గ్రామానికి చెందిన వ్యక్తులు ఈ బియ్యాన్ని తరలించేందుకు సిద్ధమవుతుండగా శనివారం పక్కా సమాచారంతో దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. పట్టుబడిన బియ్యాన్ని ప్రభుత్వ గోదాంలకు తరలించినట్టు తెలిపారు. అలాగే వ్యక్తిపై కేసు నమోదు చేసి వాహనాన్ని పార్వతీపురం గ్రామీణ ప్రాంత పోలీసుస్టేషన్‌కు అప్పగించామన్నారు. దాడుల్లో సీఎస్‌డీటీ ఎం.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాలు కలిగిన వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైమ్: ఇంటిలిజెన్స్ అధికారుల సమాచారం మేరకు పేలుడు పదార్థాలు కలిగి ఉన్న వ్యక్తిని విజయనగరం పోలీసులు అరెస్టుచేశారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. విజయనగరం డీఎస్పీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం టు టౌన్ పరిధిలోని అబాద్ వీధికి చెందిన సీరజ్‌ఉర్ రెహ్మన్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్ స్నేహితులు. వీరు పేలుడు పదార్థాలతో రెండు చోట్ల సంచరించినట్టు ఇంటిలిజెన్స్ అధికారులు గుర్తించారు. పహల్గాం ఘటనతో అప్రమత్తమైన పోలీసులు వీరి సంచారంపై నిఘాపెట్టారు. జిల్లా ఎస్పీకి సమాచారం అందించడంతో ఆయన ఆదేశాల మేరకు విజయనగరం డీఎస్పీ టుటౌన్ ఎస్ఐతో కలిసి శుక్రవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో విజయనగరంలోని అబాద్ వీధిలో ఉంటున్న సీరాజ్ ఉర్ రెహ్మాన్ ఇంటిని సోదా చేశారు. ఆయన ఇంటిలో ఉన్న అమ్మోనియం సల్ఫర్, అల్యూమినియం పౌడర్, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. విషయాన్ని రాష్ట్ర డీజీపీకి చేరవేయడంతో హైదరాబాద్‌లోని సమీర్‌ను సైతం అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్, అన్‌లాఫుల్ సస్పెన్షన్ యాక్టు అరెస్టుచేసి విజయనగరం కోర్టుకు తరలించగా 15 రోజులు రిమాండ్ విధించింది.

పల్లె విద్యార్థులకు నిబంధనల శాపం

- ఉచిత విద్యకు గ్రామీణ విద్యార్థుల దూరం
- ఒకటి, మూడు కిలోమీటర్ల నిబంధనలతో ఇక్కట్లు
- జిల్లాలో 302 ప్రైవేటు పాఠశాలల్లో చేరేందుకు అవకాశం
- దరఖాస్తు చేసేందుకు ఈ నెల 19 వరకు అవకాశం
- నిబంధనలు సడలించాలని కోరుతున్న తల్లిదండ్రులు, విద్యా వేత్తలు


పాఠశాలలో పిల్లలకు విద్యాబోధన చేస్తున్న టీచర్ (ఫైల్)

రామభద్రపురం: విద్యాహక్కు చట్టం - 2009 ప్రకారం పేద, బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాలి. అయితే పాఠశాల విద్యార్థి నివాసం నుంచి ఒకటి లేదా మూడు కిలోమీటర్లలోపు ఉండాలనే నిబంధన గ్రామీణ విద్యార్థులకు శాపంగా మారింది. ఈ నిబంధనలతో పట్టణాల్లోనే ప్రైవేట్ పాఠశాలలు ఉండడంతో ఆ పరిసర ప్రాంతాలకు చెందిన వారే ఉచిత విద్య సీట్లు పొందే అవకాశం ఉంది. దీంతో గ్రామీణ విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో సీట్లను పొందలేకపోతున్నారు.

శాపంగా మారిన నిబంధనలు

ఉచిత సీట్లు కేటాయింపుల్లో ప్రభుత్వ నిబంధనలు గ్రామీణ విద్యార్థులకు శాపంగా మారాయి. విద్యార్థి నివాసం నుంచి ఒక కిలోమీటరు పరిధిలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలో సీట్లు పొందేందుకు మొదటగా అవకాశం కల్పిస్తారు. తరువాత పరిస్థితులను బట్టి మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న పాఠశాలల విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. అంటే ఒక కిలోమీటరు పరిధిలోని విద్యార్థుల సీట్లు కేటాయింపులో మిగిలి ఉంటే 3 కిలోమీటర్లు పరిధిలో ఉన్న విద్యార్థికి కేటాయించేందుకు అవకాశం ఉంది. ప్రైవేట్ పాఠశాలలు ఉండేది పట్టణాల్లోనే కనుక పట్టణ పరిసర ప్రాంతాల వారికే ఉచిత సీట్లు దక్కుతాయి. అయితే గ్రామీణ పేద విద్యార్థులకు దక్కే అవకాశం లేదు. ఈ నిబంధనలను డలించి గ్రామీణ విద్యార్థులకు కూడా సీట్లు పొందే అవకాశం కల్పించాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

నిబంధనలు సడలించాలి



ఉచిత సీట్లు కేటాయింపుల్లో ప్రభుత్వ నిబంధనలను సడలించాలి. విద్యార్థి నివాసం నుంచి ఒక కిలోమీటరు, మూడు కిలోమీటర్లు పరిధి విధించడం ద్వారా గ్రామీణ పేద విద్యార్థులకు సీట్లు పొందే అవకాశం లేదు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని సీట్లను కేటాయిస్తే బాగుంటుంది. దీంతో గ్రామీణ విద్యార్థులు ఉచిత సీట్లు పొందే అవకాశం కలుగుతుంది. పక్కాగా ప్రణాళికబద్ధంగా అమలు చేయాలి.

– కె.విజయగౌరి, యూటీఎఫ్ నాయకురాలు

పేదలకు 25 శాతం ఉచిత సీట్లు..

పేద విద్యార్థులకు ఉచిత సీట్లు పొందేందుకు ప్రభుత్వం ఈ నెల 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్, పాఠశాలల్లో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన నిరుపేద పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుంది. డ్రాపౌట్లు లేకుండా చర్యలు చేపట్టడమే కాకుండా, పాఠశాలల్లో సీట్లు పొందిన విద్యార్థుల నుంచి ఎటువంటి ఫీజులు వసూలు చేయకూడదు. జిల్లా వ్యాప్తంగా 302 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా విద్యాహక్కు చట్టం - 2009 సెక్షన్ 12(1)సీ ద్వారా గత ఏడాది 283 పాఠశాలల్లో 1326 మంది పేద విద్యార్థులు ప్రవేశం పొందారు. వీరిలో అధిక శాతం విద్యార్థులు ఆయా విద్యా సంస్థల్లో కొనసాగుతున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే సీట్ల కేటాయింపు



ప్రభుత్వ నింబధనల ప్రకారమే సీట్లు కేటాయిపు ఉంటుంది. విద్యార్థి నివాసం నుంచి ఒక కిలోమీటరు, మూడు కిలోమీటర్లు పరిధి మాత్రమే ఉండాలి. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశానికి అవకాశం కల్పించడం పేద విద్యార్థులకు వరం లాంటిది. నోటిఫికేషన్ ప్రకారం అర్హులు దరఖాస్తు చేసుకోవాలి. అలాగే విద్యా హక్కు చట్టాన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు పక్కాగా పాటించాలి.

– యు.మాణిక్యంనాయుడు, డీఈవో, విజయనగరం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పక్కాగా అమలు

చదువు కొనుక్కొనే స్తోమత లేని ఎంతో మంది పేద విద్యార్థులకు చదువుకు అంతరాలు, అడ్డుగోడలు ఉండకూడదని ఆలోచించి విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలనే నిబంధనను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పక్కాగా అమలు చేసింది. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంలో గతంలో అనేక ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత విద్యాహక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేసింది.

'గిరి వెలుగు'కు తెర!

- కార్యాలయ సామగ్రి తరలింపు
- డీఆర్‌డీఏలో విలీన ప్రక్రియకు శ్రీకారం


ఐటీడీఏ కార్యాలయం నుంచి డీఆర్‌డీఏ కార్యాలయానికి సామగ్రిని తరలిస్తున్న గిరివెలుగు సిబ్బంది

పార్వతీపురం: గిరిజన మహిళలకు ప్రత్యేకంగా లింక్ రుణాలు, సబ్సిడీలు, సంక్షేమ పథకాల అమలుకు ఏర్పాటు చేసిన గిరి వెలుగు (టీఎంపీయూ) కార్యాలయాన్ని డీఆర్‌డీఏ కార్యాలయంలో విలీనం చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. శనివారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో వున్న గిరివెలుగు కార్యాలయంలో వున్న ఫర్నిచర్, కంప్యూటర్‌లు, ఇతర రికార్డులను తరలించారు. గిరిజన మహిళలకు ఉపయుక్తంగా ఉండేందుకుగాను గిరిజన మహిళా సంఘాల అభ్యున్నతికి దోహదపడేలా గిరివెలుగును దశాబ్ద కాలం క్రితం ఏర్పాటు చేశారు. అయితే గిరి వెలుగు కార్యాలయాన్ని డీఆర్‌డీఏలో విలీనం చేయడంతో గిరిజనులకు ఐటీడీఏలో ఇక నుంచి వెలుగు విభాగం ఉండని పరిస్థితి ఏర్పడనుంది. ఈ విషయమై గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌మార్ మాట్లాడుతూ గిరిజన మహిళా సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన గిరివెలుగును డీఆర్‌డీఏలో విలీనం చేయడం వల్ల గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇక మీదట గిరిజన మహిళలకు ప్రత్యేక సేవలు, పథకాలు అందే పరిస్థితి వుండదన్నారు. ఈ చర్య గిరిజన హక్కులను కాలరాయడమే అవుతుందన్నారు. ప్రభుత్వం డీఆర్‌డీఏలో గిరివెలుగు విలీనం ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఐటీడీఏలో గ్రీవెన్స్ ఎత్తివేయడంతో కలెక్టర్ కార్యాలయంలో అందరితో పాటే గిరిజనులను సమస్యలు తెలియజేయాల్సి వస్తుందని, గిరి వెలుగు కార్యాలయం డీఆర్‌డీఏలో విలీనంతో గిరిజనులకు సేవలందక మరింత ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం వుందన్నారు. ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరారు.

క్రైం కార్నర్

పిడుగు పడి వ్యక్తి మృతి


పిడుగు పడి మృతి చెందిన గంగులు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం పిడుగు పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి ఎస్ఐ యు.మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజపతినగరం మండలంలోని తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన దేవర గంగులు(45) గొర్రెలు కాపరి. అత్తవారి గ్రామమైన దేవుపల్లిలో గొర్రెలను కాపలా కాస్తూ జీవనం సాగిస్తున్నట్టు తెలిపారు. సాయంత్రం ఊరికి దూరంగా పొలాల్లో గొర్రెలను కాస్తుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందినట్టు చెప్పారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర సర్వజన ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బొండపల్లి: మండలంలోని బోడిసింగిపేట గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి ఎస్ఐ యు.మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్ల రంగు ప్యాంటు, కాఫీ కలర్ టీ షర్టు ధరించి సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాల పాలైన వ్యక్తిని జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు బొండపల్లి పోలీసులను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


మృతుడు సన్యాసిరావు (ఫైల్)

పూసపాటిరేగ: మండలంలోని కామవరం జంక్షన్‌లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పేరాపురం గ్రామానికి చెందిన తాలాడ సన్యాసిరావు (49) రోడ్డు దాటుతుండగా బైక్‌పై వచ్చిన వ్యక్తి వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని విజయనగరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, విజయనగరం జిల్లా కేంద్రాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్ఐ దుర్గాప్రసాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి ఒకరు..

చీపురుపల్లి: స్థానిక రైల్వేస్టేషన్‌లో రైలు నుంచి జారి పడి మరడాన రామ్మూర్తి(60) అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడు రాజమండ్రి నుంచి తెర్లాం మండలంలోని ఎంఆర్.అగ్రహారం వెళ్లేందుకు చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో దిగాడు. రైలు దిగుతుండగా ప్రమాదం జరగడంతో గాయాల పాలయ్యాడు. దీంతో ఆయన్ను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం : డీఎంహెచ్‌వో


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు

పార్వతీపురం టౌన్: జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు జరిపి వివరాలు వెల్లడించడం చట్టరీత్యా నేరమని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. అటువంటి స్కానింగ్ సెంటర్లపై, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా సెంటర్ల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. గర్భస్థ శిశు స్థితిగతులు, సమస్యలు తెలుసుకునేందుకే స్కానింగులు చేయాలే తప్ప, వీటిని ఆసరాగా తీసుకుని గర్భస్థ శిశు వివరాలు వెల్లడించడం నేరమన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం అమలుపై జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం డీఎంహెచ్‌వో అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 44 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ప్రతి స్కానింగ్ సెంటరులో సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు ఆయా కేంద్రాలపై ప్రోగ్రాం అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇకపై ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగే అబార్షన్ల వివరాలతో పాటు అందుకు తగిన కారణాలను తమకు సమర్పించాలని స్పష్టం చేశారు. స్త్రీల పట్ల వివక్ష కూడదని వివరించారు.

సమాజంలో చైతన్యం తీసుకురావాలి

బాలికల పట్ల వివక్ష లేకుండా సమాజంలో చైతన్యం తీసుకురావాలన్నారు. ముఖ్యంగా జూనియర్ కళాశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో అవగాహన కల్పించడం ద్వారా మంచి ఫలితాలు ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఆడపిల్లల పట్ల అవగాహన పెరిగిందని, అది మరింత పెరగడం మంచి శుభ పరిణామమని, ఆ విధంగా అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. కమిటీ సభ్యులు సూచించిన సలహాలను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్తులో మరింత పటిష్టంగా చట్టాన్ని అమలు చేస్తామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.కేవీఎస్ పద్మావతి, జిల్లా ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్‌మోహన్‌రావు, డీఐవో డా.ఎం.నారాయణ, డీజీవో డా.సీహెచ్ కమలకుమారి, చిన్న పిల్లల వైద్యులు డా. వి.శ్రీధర్, రేడియోలజిస్టు డా.ఎం.జయరాం, సామాజిక కార్యకర్త శ్రీహరి, ఇతర వైద్యులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

- ఇంచార్జ్ డీఆర్‌వో మురళి


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ మురళి

విజయనగరం అర్బన్: ఓటరు జాబితాలో పేరు నమోదు కోసం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చునని ఇంచార్జ్ డీఆర్‌వో మురళి అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తమ చాంబర్‌లో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు నమోదు కోసం ఏడాది పొడవునా ఎప్పుడైనా ఫారం 6లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అదే విధంగా మార్పులు చేర్పుల కోసం ఫారం 8, తొలగింపుల కోసం ఫారం 7లో దరఖాస్తు చేయాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన పోలింగ్ బూత్ ఎక్కడైనా ఉంటే వాటిని తొలగించేందుకు ప్రతిపాదనలు పంపిస్తామని వాటి వివరాలను అందజేయాలని కోరారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1500 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే మరొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదిస్తామని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 1200 ఓటర్లు పైబడిన కేంద్రాలు 138 వరకు ఉన్నాయని మురళి తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నుంచి శ్రీనివాస్‌రెడ్డి, టీడీపీ నుంచి కుటుంబరావు, బీజేపీ నుంచి అప్పారావు, కాంగ్రెస్ నుంచి సతీష్‌కుమార్, జనసేన నుంచి సతీష్, బీఎస్పీ నుంచి సోములు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనిమియాతో తస్మాత్...

- డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధిని త్వరగా గుర్తించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నేషనల్ సికిల్‌సెల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా సికిల్‌సెల్ ఎనిమియాపై జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యాధికారులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొని మాట్లాడారు. సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా పని చేయాలన్నారు. సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధిగ్రస్తులకు రక్తం తగ్గిన వెంటనే మళ్లీ ఎక్కించాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలకు, ఏఎన్‌ఎంలకు వైద్యాధికారులు శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణలో డీఎల్‌వో డాక్టర్ కె.రాణి, డాక్టర్ అర్చనదేవి, డాక్టర్ కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

బొబ్బిలి రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసే వారే నిజమైన హీరోలని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని కోమటిపల్లి తాండ్రపాపారాయ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మిలీనియం సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్, రెడ్‌క్రాస్, కారుణ్యఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల విద్యార్థులు పలువురు రక్తదానం చేశారు. వారిని నిర్వాహకులు అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు,ఎక్సైజ్ సీఐ చిన్నంనాయుడు, ఎన్ఆర్ఐ ఆస్పత్రి సీఈఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

• చెరువులను తలపిస్తున్న రోడ్లు


మెంటాడ జంక్షన్ రోడ్డుపై నిలిచిన నీరు

గజపతినగరం: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గజపతినగరం మండల కేంద్రం మెంటాడ జంక్షన్ నుంచి పురిటిపెంట ఆంజనేయ స్వామి గుడి వరకు బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. అయితే పనులు అస్తవ్యస్తంగా ఉండడంతో శనివారం కురిసిన వర్షానికి రోడ్డంతా నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందిపడ్డారు. రహదారి మరమ్మతులపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఆర్ అండ్‌బీ జేఈ అజయ్ వద్ద ప్రస్తావించగా.. డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో రోడ్డుపై నీరు నిలిచిపోతోందని, ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అలాగే గజపతినగరం నుంచి మెంటాడ వరకు నాలుగన్నర కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా


విద్యార్థి చింతా రాకేష్ మృతదేహం


చింతా రాకేష్ (ఫైల్)

కలికిరి: ఈత సరదా ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ప్రాణాలు తీసింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కలికిరి జేఎన్టీయూ కళాశాల నుంచి శనివారం మధ్యాహ్నం సుమారు పది మంది విద్యార్థులు కళాశాల సమీపంలోని ఓ వ్యవసాయ బావి వద్దకు ఈతకెళ్లారు. ఈత వచ్చిన వారు బావిలో దిగగా.. ఈత రానివారు గట్టుపై కూర్చుని చూస్తున్నారు. ఈ క్రమంలో సివిల్ ఇంజిరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పెంట గ్రామానికి చెందిన సూర్యనారాయణ కుమారుడు చింతా రాకేష్(18) బావిలోకి ఒడ్డుపై నుంచి దూకాడు. బావిలోని పూడిక మట్టిలో ఇరుక్కుపోయాడు. గమనించిన స్నేహితులు కాపాడటానికి ప్రయత్నించినా ఉపయోగం లేక పోవడంతో కళాశాలకు వెళ్లి అధ్యాపకులకు, సిబ్బందికి సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు పోలీసులకు సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు పీలేరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సాయంతో సుమారు మూడు గంటల పాటు శ్రమించి విద్యార్థి మృతదేహాన్ని వెలికితీశారు. విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశారు. కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మదన్‌మోహన్ రెడ్డి తెలిపారు.

విద్యార్థుల పట్ల పర్యవేక్షణ కరువు...

జేఎన్టీయూ కళాశాల విద్యార్థుల పట్ల పర్యవేక్షణ కరువవ్వడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు నిత్యం కళాశాల బయటకు వెళ్తూ వస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. రాత్రి సమయాల్లోనూ ఇలాగే జరుగుతోందని, సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బందిపై మండిపడ్డారు. గతంలోనూ ఇలా ఓ విద్యార్థి ఈతకెళ్లి మృతి చెందినా కళాశాల అధికారులకు కనువిప్పు కలగలేదని చెప్పారు.

పాడైన రైల్వేగేట్

- గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్


నిలిచిపోయిన వాహనాలు

దత్తిరాజేరు: మండలంలోని పెద మానాపురం రైల్వే గేట్ శనివారం రాత్రి పాడవ్వడంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. రెండువైపులా సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో అటు వైజాగ్, విజయనగరం, గజపతినగరం.. ఇటు ఒడిశా, పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి తదితర దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. సిబ్బంది వచ్చి సమస్య పరిష్కరించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

మద్యం తాగి డ్రైవ్‌చేస్తే రూ.10వేలు జరిమానా

- ఒకే రోజు 85 డ్రంకన్‌డ్రైవ్ కేసుల్లో రూ.8.50 లక్షల జరిమానా వసూలు


జరిమానా వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానాను విజయనగరం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎంఎస్‌హెచ్ఆర్ తేజచక్రవర్తి విధించినట్టు ఎస్పీ వకుల్‌జిందల్ శనివారం తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 85 కేసులు నమోదు చేశారు. వారిని విజయనగరం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. మేజిస్ట్రేట్ తేజ చక్రవర్తి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 85 మందికి రూ.8.50 లక్షల జరిమానా విధించినట్టు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మద్యం మత్తులో చాలామంది వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావడం, ఇతర వాహనాలను ఢీ కొట్టి ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. ఈ తరహా వాహనదారులను కట్టడి చేసేందుకు, ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. డ్రంకన్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నట్టు వెల్లడించారు.